క్లుప్తంగా

మల్లన్న సన్నిధిలో మార్కెట్ కమిటీ చైర్మన్ పూజలు



సురేందర్‌ను సన్మానిస్తున్న ఆలయ అర్చకుడు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామిని పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జడల సురేందర్, పాలకవర్గ సభ్యులు సోమవారం దర్శించుకొని కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు దూపం వీరభద్రయ్య వారిని స్వామివారి కండువాతో సన్మానించారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

19న విద్యుత్ వినియోగదారుల సదస్సు

మంథని: ముత్తారంలోని వెంకటలక్ష్మి గార్డెన్‌లో ఈనెల 19న డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ వేణుగోపాలచారి ఒక ప్రకటనలో తెలిపారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్చడం, లో వోల్టేజీ హెచ్చు తగ్గులు, నూతన సర్వీసులు, అదనపు లోడు క్రమబద్ధీకరణతో పాటు సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. మంథని, ముత్తారం, కమాన్‌పూర్, బేగంటపేట, ఎక్లాస్‌పూర్, మండలంలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశుధ్య పనులను అడ్డుకున్న కార్మికులు



రవీందర్ రెడ్డితో వాగ్వాదానికి దిగిన కార్మికులు

జూలపల్లి: మండలంలోని కోనరావుపేటలో పారిశుధ్య పనులను సర్పంచ్ భర్త రవీందర్ రెడ్డి ప్రైవేట్ వ్యక్తులతో చేయిస్తున్నారన్న సమాచారంతో గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. సమస్యలు పరిష్కరించకముందే డబ్బులిచ్చి పనులు చేయించడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెకు అన్నివర్గాల ప్రజలు మద్దతివ్వాలని సంఘం మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్ కోరారు. కారోబార్ల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం, మధు, కార్మికులు బాణయ్య, నాగయ్య, భాస్కర్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

గోదావరిఖని: వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నియోజకవర్గానికి చెందిన 20 మంది లబ్ధిదారులకు రూ.8.75 లక్షల విలువైన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే చందర్ క్యాంపు కార్యాలయంలో వారికి అందజేశారు. కార్యక్రమంలో రామగుండం నగర డిప్యూటీ మెడికల్ నడిపెల్లి అభిషేక్‌రావు. జెడ్పీటీసీ నారాయణ, కార్పొరేటర్లు ఇంజపురి పులిందర్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పెద్ది వెంకటేశ్ తండ్రి కాంతయ్య ఇటీవల మృతిచెందగా సోమవారం టీఎస్‌టీఎస్ రాష్ట్ర మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమిల్ల రాకేశ్ పరామర్శించారు. తన బాల్యమిత్రుడు పల్లెర్ల శ్రీనివాస్ తండ్రి మల్లేశం మృతిచెందగా వారి కుటుంబీకులను పరామర్శించారు. నాయకులు ఉప్పురాజు, తిరుమల్ రావు, ఉప్పు శివకుమార్, విద్యాసాగర్, బోయిని మనోజ్, తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



కాల్వశ్రీరాంపూర్ : మండలకేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ సీహెచ్ రాజు అనారోగ్యానికి గురికాగా సోమవారం ఆటో యూనియన్ సభ్యులు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ యూనియన్ అధ్యక్షుడు చాంద్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

కాల్వశ్రీరాంపూర్: మండలకేంద్రంలోని గంగాధరి నారాయణ అనే రైతుకు చెందిన గేదె సోమవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. పాడిగేదెను మేతకోసం తీసుకెళ్లగా టేకుల చెరువు సమీపంలో విద్యుత్‌పోల్‌కు ఉన్న సపోటు తీగ తగిలి మృత్యువాతపడినట్లు గ్రామస్తులు తెలిపారు. గేదె విలువ రూ.80 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. పరిహారం అందించి ఆదుకోవాలని ఉపసర్పంచ్ సుధాటి కరుణాకర్ రావు ప్రభుత్వాన్ని కోరారు.

జల్సాలకు అడ్డాగా.. ‘గుండారం’

- అర్ధరాత్రి వరకు రిజర్వాయర్ కట్టపై ఆగడాలు
- విచ్చలవిడిగా మద్యం, మత్తు పదార్థాల వాడకం
- ఘర్షణలకు పాల్పడుతున్న యువకులు
- నిఘా ఏర్పాటు చేయాలంటున్న స్థానిక ప్రజలు



గుండారం రిజర్వాయర్

కమాన్‌పూర్: మద్యం తాగేందుకు, మత్తు పదార్థాలు సేవించేందుకు గుండారం రిజర్వాయర్ యువకులకు అడ్డాగా మారింది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రిజర్వాయర్ కట్టపైకి బైక్ రాకపోకలు. మద్యం, మత్తులో ఘర్షణలు. ఎవరైనా అడ్డు చెప్తే వారిపై దాడి చేయడం. ప్రతీరోజు రిజర్వాయర్ కట్టపై యువకుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోందని గ్రామప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అర్ధరాత్రి దాకా అడ్డా..

కమాన్‌పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్ మద్యం తాగేందుకు, మత్తు పదార్థాలు పీల్చేందుకు యువతకు అడ్డాగా మారింది. మండల కేంద్రం నుంచే కాకుండా రామగిరి మండలం సెంటనరీకాలనీ, యైటింక్‌లైయిన్ కాలనీ, పెద్దపల్లి ప్రాంతాల నుంచి రోజూ వందల సంఖ్యలో యువకులు బైక్‌లపై వచ్చి కట్టపై అడ్డాలు వేస్తున్నారు. అర్ధరాత్రి వరకు మద్యం తాగుతూ మత్తు పదార్థాలు వాడుతున్నారు. కట్టపై ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాటుపై ఖాళీ సీసాలు పగులగొడుతున్నారు.

దాడికి పాల్పడుతున్న యువకులు

రిజర్వాయర్ కట్టపై యువకులు అర్ధరాత్రి వరకు అడ్డాలు వేసి జల్సాలు చేయడమే కాకుండా రాత్రి వేళ కేరింతలు, బైక్‌ల సైలెన్సర్ల సౌండ్‌లు చేయడంతో పాటు బ్యాచ్‌లుగా వచ్చిన యువకులు వారిలో వారే ఘర్షణలకు పాల్పడుతున్నారు. గ్రామస్తులు ఎవరైనా పంట పొలాలకు వెళ్లే వారు అటువైపు వెళ్లి ఇదేంటని అడిగితే వారిపై దాడులకు పాల్పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్‌లో ఉన్న చేపల కోసం కాపలా ఉండేందుకు వెళ్లిన పలువురు మత్స్యకారులపై బుధవారం రాత్రి సెంటినరీకాలనీకి చెందిన పలువురు యువకులు దాడి చేయడానికి యత్నించడంతో మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు రిజర్వాయర్ వద్దకు వచ్చి యువకులను అదుపులోకి తీసుకున్నారు.

చట్టరీత్యా చర్యలు



కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కడైనా ఆరుబయట మద్యం తాగినా, మత్తు పదార్థాలు వినియోగించినా.. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొంటాం. గుండారం రిజర్వాయర్ వైపు పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తాం. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. – బేతి రాములు, ఎస్సై, కమాన్‌పూర్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ శైలజ

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డులను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పనులు, మురుగు కాల్వల్లో పూడికతీత పనులను పర్యవేక్షించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధిచెంది రోగాలబారిన పడే అవకాశముందన్నారు. స్వచ్ఛ మంథనిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం స్థానిక ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని సందర్శించి సదుపాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, వార్డు కౌన్సిలర్లు, తదితరులున్నారు.

కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ పద్మజ

ధర్మారం: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న 24 గంటల విద్యుత్ సరఫరాను తప్పుపట్టిన కాంగ్రెస్ పార్టీకి రైతులు తగిన గుణపాఠం చెప్పాలని జెడ్పీటీసీ సభ్యురాలు పుస్కూరి పద్మజ , సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాం రెడ్డి అన్నారు. మండలంలోని కటికెనపల్లి రైతువేదిక క్లస్టర్ రైతులతో పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు పుస్కూరి రామారావు, ఎగ్గెల స్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మిట్ట తిరుపతి, క్లస్టర్ గ్రామాల సర్పంచులు కారుపాకల రాజయ్య, తిరుపతి, గంగారెడ్డి, లక్ష్మి, దార మల్లమ్మ, మల్లేశం, బద్దం సుజాత, ఎంపీటీసీలు సూరమళ్ల శ్రీనివాస్, భూక్య సరిత, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రిన్సిపాల్ ప్రభాకర్, లెక్చరర్లతో పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1999–2001లో చదివిన ఇంటర్మీడియట్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో చదివిన అప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, లెక్చరర్ శంకరయ్య, బాబా, భద్రయ్య, రహీముద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు జహంగీర్, తమన వేణు సతీశ్, ఆగండ్ల శంకర్, శ్యాంసుందర్, నగేశ్, వెంకటేశ్,కిట్టు, శ్రీనివాస్, మమత, లత తదితరులున్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



జూలపల్లిలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎలిగేడు: మండలకేంద్రంలో జీపీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం పన్నెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు, జీపీ కార్మికులు మాట్లాడుతూ.. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ. ఖాజా, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆసంపల్లి చంద్రయ్య, నాయకులు కొండయ్య, మొగిలి, నర్సయ్య, సత్యనారాయణ, కోంద్ర నర్సయ్య, చిరంజీవి, కార్మికులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట..

జూలపల్లి: పంచాయతీ కార్మికుల, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ముందు దీక్షా శిబిరంలో కార్మికులు నిరసన తెలిపారు. కార్మిక సంఘం అధ్యక్షుడు సంపత్‌కుమార్, గౌరవాధ్యక్షుడు ఆసంపెల్లి బాణయ్య, నాగయ్య, భాస్కర్, పురుషోత్తం, న్యాతరి లచ్చయ్య, రెవెల్లి సంపత్, మల్లారపు వెంకటేశం, రాజేశం, స్వామి తదితరులున్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్: తమ డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని ఆరోపిస్తూ మండలకేంద్రంలో జీపీ కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని జీపీ కార్మికుల యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు కలవేన గట్టయ్య వాపోయాడు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంపత్, రాజబాబు, లక్ష్మణ్, అనసూయ, ఓదెమ్మ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసరి ఉష

జీవో 51ని ఉపసంహరించాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష పంచాయతీ కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. జీవో 51ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.19వేలు ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. నాయకులు ఎండీ. రియాజ్, అరుణ, శారద, రమేశ్, సాధిక్, రజనికాంత్, శ్రీధర్, తదితరులున్నారు.

ఓదెలలో..

ఓదెల : తమ సమస్యలను సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఓదెలలో పంచాయతీ కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, నాగయ్య, మల్లేశం, కుమార్, దిలీప్ పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే చెప్పండి..

జ్యోతినగర్: ‘అన్నా బాగున్నారా.. మీ ఏరియాకు వచ్చా. మీ సమస్యలు ఉంటే చెప్పండి. వాటిని పరిష్కరిస్తాను అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం రామగుండం కార్పొరేషన్ నాలుగో డివిజన్‌లో గడప గడపకూ పాదయాత్రలో భాగంగా ప్రతి ఒక్కరి సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, పలువురు కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న విజయరమణారావు

సుల్తానాబాద్ రూరల్: హామీలు ఇచ్చి నేరవేర్చలేని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని కనుకులలో గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరమణారావు ఇంటింటా తిరిగి ప్రభుత్వ అవలంబిస్తున్న వైఖరిపై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదలకు రూ.5లక్షల ఆర్థికసాయం అందిస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, నిరుద్యోగ భృతికింద రూ.4వేలు, అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

జూలపల్లి: గ్రామీణ ప్రజలు వ్యాధుల నివారణకు ఆరోగ్య నియమాలు పాటించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాదుల వేంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లెలో పెద్దపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదిహేను రోజుల్లో గ్రామాల్లో 15 వందల మందికి పరీక్షలు నిర్వహించామని, ఇందులో 150 మందికి కొత్తగా డయాబెటిస్ ఉన్నట్లు గుర్తించామన్నారు. అనంతరం డయాబెటిస్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యశిబిరం కో ఆర్డినేటర్ లయన్ డా. గంప గోవర్దన్, ఎండీ, ఉపాధ్యక్షుడు లయన్ మీసాల సత్యనారాయణ, స భ్యులు మట్ట రాంరెడ్డి, ఆరెపెల్లి కుమారస్వామి, మల్లెత్తుల లక్ష్మణ్, తాళ్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న సురేశ్ రెడ్డి

ఎలిగేడు: ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ కృషి చేస్తోందని పార్టీ నాయకుడు గొట్టి ముక్కుల సురేశ్‌రెడ్డి అన్నారు. బ్రేక్ ఫాస్ట్ విత్ జీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రాములపల్లిలో ఆయన గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో గ్రామ గ్రామాన ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాల్వల శ్రీనివాస రెడ్డి, మడ్లపల్లి నారాయణ, ఎడ్ల సతీశ్, డాక్టర్ నర్సయ్య, లక్ష్మీరాజం, రాజయ్య, గంట వెంకటేశ్, గంట కుమార్, ఉదయ్, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు అందించాలి



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

మంథని: ప్రభుత్వం జీవో 58, 59ను రద్దుచేసి నిరుపేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని గుంజపడుగు చౌరస్తాలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. గ్రా మంలోని ప్రభుత్వ భూములు, గ్రామ కంఠం, సీలింగ్ భూముల్లో ఎంతోకాలంగా పేదలు నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని, ప్రభుత్వం వారిని రూ.లక్షలు వెచ్చించాలనడం సరికాదని పార్టీ మండలాధ్యక్షుడు వీరబోయిన రాజేందర్ అన్నారు. ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు బూడిద రాజు, మండల ప్రధాన కార్యదర్శి ఆరె ఒదెలు, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు పాషా, నాయకులు బూడిద మల్లేశ్, ఎడ్ల సాగర్, ఎలుక సందానందం, తదితరులున్నారు

శివాలయంలో పూజలు

సుల్తానాబాద్ : సుల్తానాబాద్‌లోని పురాతన శివాలయంలో ఆషాఢ మాసం చివరి సోమవారం కావడంతో ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకం, అన్నపూజ , తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందించారు.

పార్టీ నుంచి బహిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పాలకుర్తి: పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఐదుగురు నేతలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు కోరారు. సోమవారం బసంత్‌నగర్‌లో పార్టీ మండలాధ్యక్షుడు ఇంజపూరి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఇటీవల టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, కేశోరాం కంపెనీ పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణతో పాటు కార్పొరేటర్ పాతిపెల్లి ఎల్లయ్య సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని పేర్కొంటూ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌ను ఓడించండి అంటూ ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే చందర్ వ్యవహరిస్తున్న తీరు వారికి నచ్చకపోతే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. సదరు ఐదుగురు నాయకులు అసమ్మతి నేతలమంటూ చెప్పుకుంటూ పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే వారిని పార్టీనుంచి సస్పెండ్ చేయాలన్నారు. దీనిపై తాము ముకుమ్మడిగా తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, పుట్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మల్లెత్తుల శ్రీనివాస్, సర్పంచులు కోల లత, దుర్గం జగన్, లక్ష్మీపతి, ఎంపీటీసీలు గంగాధర రమేశ్, దుర్గం కుమార్, మండల కో ఆప్షన్ సభ్యులు సర్వర్ పాషా, నాయకులు సాగర్, రాజేశం, కొంరయ్య, మదన్ మోహన్‌రావు, దేవేందర్, గద్వాల నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న మమతారెడ్డి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు

పెద్దపల్లిరూరల్: మొక్కల పెంపకంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మమతారెడ్డి అన్నారు. పెద్దపల్లిలోని శాంతినగర్‌లో సోమవారం కమిషనర్ శ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్ భిక్షపతి పలువురితో కలిసి ఇంటింటా మొక్కలు అందజేశారు. ఇళ్లముందు, రోడ్లవెంట నీడ, పూల నిచ్చే మొక్కలు నాటాలన్నారు. ఇంటి ఆవరణలో పూలు, కూరగాయల మొక్కలు పెంచాలని, దీంతో కూరగాయల ఖర్చుకూడా ఆదా అవుతుందన్నారు.